TGTEL/26/A7716

# ఉద్యమ పోరు

ప్రతి పదం.. పోరాట కదం..

| వరంగల్ | సంపుటి : 1 | సంచిక : 1 | గురువారం | 10.09.2026 | పేజీలు : 8 | వెల : 3 /- | ఎడిటర్ - బండారి సుమంత్ |
|---|---|---|---|---|---|---|---|
| Warangal | Volume - 1 | Issue - 1 | Thursday | 10.09.2026 | Pages - 8 | Price: 3 /- | Editor - Bandari Sumanth |


# ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కుట్ర

## - కేసీఆర్‌పై అసెంబ్లీలో రేవంత్ ఆరోపణలు

- స్పీకర్‌ను దూషించడంపై రేవంత్ ఆగ్రహం
- ప్రజాసమస్యలపై చర్చకు ప్రభుత్వం సిద్ధమని వెల్లడి
- బీఆర్ఎస్ సభ్యులను ఉసిగొలిపారని విమర్శ
- స్పీకర్‌కు కేసీఆర్ క్షమాపణ చెప్పలేదని వ్యాఖ్య



**ఉద్యమ పోరు, హైదరాబాద్ :** అసెంబ్లీ స్పీకర్‌ను దూషించిన ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్రంగా స్పందించారు. స్పీకర్‌పై మాటల దాడికి పాల్పడటం పార్లమెం ట్, ముంబయి, పుల్వామా దాడులతో సమానమని వ్యాఖ్యా నించారు. ప్రజాసమస్యలపై చర్చ జర గకుండా అడ్డుకునేందుకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కుట్రకు తెరతీశారని ఆరోపించారు. శాస నసభలో బుధవారం మాట్లాడిన సీఎం.. స్పీకర్ స్థానాన్ని, ఆయన తల్లిని అవమా నించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. స్పీకర్‌ను దూషించిన ఘటనను సభ్యులంతా ముక్తకంఠంతో ఖండించారని తెలిపారు. ఇలాంటి ఘటన తర్వాత కేసీఆర్ స్వయంగా స్పీకర్‌తో మాట్లాడి క్షమాపణలు చెబుతారని ప్రజా స్వామ్యవాదులు భావించారని అన్నారు. కానీ కేసీఆర్ అలా చేయలేదని విమ ర్శించారు. ప్రజాసమస్యలపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని రేవంత్‌రెడ్డి తెలిపారు. ఈ సమస్యలు చర్చకు వస్తే తమ గుట్టు రట్టవుతుందనే భయంతోనే ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కేసీఆర్ కుట్రకు తెరతీశారని ఆరోపించారు. బీఆర్ఎస్ సభ్యులను ఉసిగొలిపి సభకు పంపిం చారని మండిపడ్డారు. ఎక్కడైతే ఈ కుట్రకు తెరలేచిందని ఆరోపించారో.. అదే ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌కు వెళ్లి డప్పులు వాయించేందుకు ప్రయత్నిస్తే అక్కడ శుద్ధీకరణ చేశారని రేవంత్ అన్నారు. ఉత్త రాఖండ్‌లో ఖర్గే నిరసనలో పాల్గొన్న మైదానాన్ని శ్రీరామసేన శుద్ధీకరణ చేసిందని గుర్తుచేశారు. ఇలాంటి దురదృ ష్టకర ఘటన తెలంగాణలోనూ చోటుచేసు కుందని వ్యాఖ్యానించారు. స్పీకర్ స్థానాన్ని అవమానించడం ప్రజాస్వామ్య వ్యవస్థను అవమానించడమేనని సీఎం పేర్కొన్నారు. సభలో సభ్యులు బాధ్యతగా వ్యవహరించాలని, ప్రజాసమస్యలపై చర్చకు సహకరించాలని కోరారు.

## గవర్నర్‌ను కలిసిన కేటీఆర్.. కాంగ్రెస్ సర్కార్‌పై ఫిర్యాదుల వెల్లువ



- గవర్నర్‌తో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ భేటీ
- 1000 రోజులు గడిచినా కాంగ్రెస్ హామీలు నెరవేర్చలేదని విమర్శ
- తమ ఎమ్మెల్యేలపై పోలీసులు దాడులు చేశారని ఫిర్యాదు
- దాడులకు సంబంధించిన ఆధారాలను గవర్నర్‌కు అందజేత
- రైతు బంధు, నిరుద్యోగ సమస్యలపై ప్రభుత్వ వైఫల్యంపై ఆరోపణ

»2

## అసెంబ్లీలో కేటీఆర్, హరీశ్‌రావు సహా సభ్యుల సస్పెన్షన్



- ఎర్రవల్లి వద్ద 'చావుడప్పు' నిరసనలపై బీఆర్ఎస్ సభ్యుల ఆందోళన
- సభను అడ్డుకుంటున్నారని మంత్రి శ్రీధర్‌బాబు ఆరోపణ
- బీఆర్ఎస్ సభ్యుల సస్పెన్షన్‌పై తీర్మానం
- సభ జరిగే అన్ని రోజులకూ సస్పెన్షన్ వర్తింపు
- అనంతరం సభ 10 నిమిషాలు వాయిదా

»2

## కేసీఆర్ ఫాంహౌస్ వద్ద శుద్ధి అసెంబ్లీలో తీవ్ర దుమారం



- నిన్న కేసీఆర్ ఫాంహౌస్ వద్ద నిరసన తెలిపిన కాంగ్రెస్ ఎస్సీ విభాగం, దళిత సంఘాలు
- ఆ ప్రాంతాన్ని బీఆర్ఎస్ నేతలు శుద్ధి చేశారన్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్
- దళితుల పట్ల వివక్షను బీఆర్ఎస్ మరోసారి నిరూపించుకుందని మండిపాటు

**ఉద్యమ పోరు, హైదరాబాద్ :** తెలంగాణ శాసనసభ మూడో రోజు సమావేశాలు ప్రారంభం కాగానే సభలో తీవ్ర దుమారం చెలరేగింది. నిన్న సిద్దిపేట జిల్లా ఎర్రవెల్లిలోని కేసీఆర్ ఫాంహౌస్ వద్ద కాంగ్రెస్ ఎస్సీ విభాగం నేతలు, దళిత సంఘాలు నిరసన తెలిపిన అనంతరం... బీఆర్ఎస్ నేతలు ఆ ప్రాంతాన్ని శుద్ధి చేశారంటూ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ సభలో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దళితులు నిరసన తెలిపి వెళ్లిన స్థలాన్ని శుద్ధి చేయడం వెనుక బీఆర్ఎస్ నాయకుల తీవ్రమైన ... »2

## E20 ఇంధనంపై తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం కీలక ప్రకటన.. కేంద్రానికి మద్దతు

- E20 పెట్రోల్‌తో వాహనాలకు నష్టం లేదన్న మంత్రి పొన్నం ప్రభాకర్
- తమకు ఎలాంటి ఫిర్యాదులు అందలేదని అసెంబ్లీలో వెల్లడి
- ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వ వాదనకు తెలంగాణ మద్దతు

»2



## ఇది బీఆర్ఎస్ సస్పెన్షన్ కాదు.. ప్రజా సమస్యలపై వేసిన సస్పెన్షన్ వేటు : హరీశ్ రావు




- అసెంబ్లీ నుంచి బీఆర్ఎస్ సభ్యులను సస్పెండ్ చేసిన స్పీకర్
- బీఆర్ఎస్ సభ్యులను కక్షపూరితంగా సస్పెండ్ చేశారన్న హరీశ్
- ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతున్నామనే భయంతోనే కుట్రలు చేస్తున్నారని మండిపాటు

»2

## ఆ బూతులు భరించలేకనే కడుపు మండి మాట్లాడా!

- కేసీఆర్ పై వ్యాఖ్యల పట్ల ఎమ్మెల్యే శంకర్ వివరణ



- ఒకరి చావును కోరడం సమర్థనీయం కాదన్న శంకర్
- సీఎం, స్పీకర్ లను బీఆర్ఎస్ నేతలు దూషిస్తున్నారని మండిపాటు
- కడుపు మండి మాట్లాడాల్సి వచ్చిందని వ్యాఖ్య

»2

## యూపీ ఎన్నికల తర్వాత ఫుల్ ఫోకస్ తెలంగాణపైనే.. బీజేపీ గెలుపును ఎవరూ ఆపలేరు : బండి సంజయ్

- రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో అధికారంలోకి వచ్చేది బీజేపీనే అన్న బండి సంజయ్
- కేసీఆర్ సర్కార్ మెడలు వంచింది బీజేపీయేనని వ్యాఖ్య
- పోలీసుల కేసులకు భయపడాల్సిన అవసరం లేదన్న సంజయ్



**ఉద్యమ పోరు, హైదరాబాద్ :** తెలంగాణలో రాబోయే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని, ఈ విజయాన్ని ఏ శక్తీ ఆపలేదని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ ధీమా వ్యక్తం చేశారు. రాబోయే ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన వెంటనే బీజేపీ అధిష్ఠానం దృష్టి పూర్తిగా తెలంగాణపైనే ఉంటుందని, రాష్ట్రాన్ని దక్కించుకోవడమే తదుపరి లక్ష్యమని వెల్లడించారు. భద్రాచలంలో నిర్వహించిన బీజేపీ కార్యకర్తలు, నాయకుల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన ఒక కాంగ్రెస్ మంత్రి ఢిల్లీకి .... »2

# కేసీఆర్ ఫాంహౌస్ వద్ద శుద్ధి అసెంబ్లీలో తీవ్ర దుమారం

**మొదటిపేజీ తరువాయి..** కులతత్వం బయటపడిందని... ఇది యావత్ దళిత సమాజ ఆత్మగౌరవాన్ని, హక్కులను తీవ్రంగా అవమానించడమేనని విమర్శించారు. దళిత సామాజిక వర్గానికి చెందిన స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను అసెంబ్లీ గేటు వద్ద బూతులు తిట్టిన అంశాన్ని మరిచిపోకముందే... బీఆర్ఎస్ మరోసారి దళితుల పట్ల తమకున్న వివక్షను నిరూపించుకుందని మండిపడ్డారు. ఈ శుద్ధి వ్యవహారంపై సభలో సమగ్ర చర్చ జరగాలని ఆయన పట్టుబట్టారు. మరోవైపు, మంత్రి ప్రసంగానికి అడ్డుతగులుతూ బీఆర్ఎస్ సభ్యులు వెల్‌లోకి దూసుకొచ్చి తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. అసెంబ్లీ ఆవరణలో బీఆర్ఎస్ మహిళా ప్రజాప్రతినిధుల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరుపై, వారిపై జరిగిన అనుచిత ప్రవర్తనపై ప్రభుత్వం తక్షణమే బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్లకార్డులతో నినాదాలు చేశారు. ఇరువైపులా నేతల పోటాపోటీ నినాదాలు, హంగామాతో సభలో తీవ్ర గందరగోళం నెలకొంది.

### యూపీ ఎన్నికల తర్వాత ఫుల్ ఫోకస్ తెలంగాణపైనే..

# బీజేపీ గెలుపును ఎవరూ ఆపలేరు

**- బండి సంజయ్**

**మొదటిపేజీ తరువాయి..**
అక్రమ మార్గాల్లో మూటలు పంపుతున్నారని, గతంలో కేసీఆర్ పాలనలోనూ అదే మంత్రి బీజేపీ కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి తీవ్రంగా వేధించారని బండి సంజయ్ ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సహాయంతో ఇస్తున్న ఉచిత సన్న బియ్యం, ఇళ్ల పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం తమ సొంత పథకాలుగా ప్రచారం చేసుకుంటూ ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. గతంలో రజాకార్ల పాలనను తలపించిన కేసీఆర్ సర్కార్ మెడలు వంచింది బీజేపీయేనని గుర్తుచేశారు. "నాపై 109 అక్రమ కేసులు నమోదు చేసినా నేనెప్పుడూ వెనకడుగు వేయలేదు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై కార్యకర్తలు సైనికుల్లా పోరాడాలి. పోలీసు కేసులకు అస్సలు భయపడాల్సిన అవసరం లేదు" అని భరోసా ఇచ్చారు. దేశాన్ని సుదీర్ఘకాలం ఏలిన కాంగ్రెస్ పార్టీ ప్రస్తుతం కేవలం నాలుగు రాష్ట్రాలకే పరిమితమైందని, తెలంగాణలో కూడా ఆ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మొదలైందని బండి సంజయ్ వ్యాఖ్యానించారు.

# కేసీఆర్‌కు చెడు జరగాలని ఆయన కుటుంబ సభ్యులే కోరుకుంటున్నారు

**- మహేశ్ గౌడ్**

**కేసీఆర్‌కు హాని జరగాలని కాంగ్రెస్ ప్రభుత్వం కోరుకోలేదన్న మహేశ్ గౌడ్**

**కేసీఆర్ గతంలో గాయపడినప్పుడు సీఎం రేవంత్ వెంటనే స్పందించారని వెల్లడి**

**కేసీఆర్‌కు రాష్ట్రంలో అత్యధిక భద్రత ఉందని వివరణ**

**సిరిసిల్లలో సీఎం రేవంత్‌కు పిండ ప్రదానంపై మహేశ్ గౌడ్ ప్రశ్నలు**

**హరీశ్‌రావు క్షుద్ర పూజలు చేస్తున్నారని కవిత మాట్లాడిన వీడియోలు ఉన్నాయని వ్యాఖ్య**



**ఉద్యమ పోరు, హైదరాబాద్, సెప్టెంబర్ 9 :** బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌కు హాని జరగాలని కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడూ కోరుకోలేదని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి. మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. ప్రతిపక్ష నేతగా ఆయనకు తగిన గౌరవం ఇస్తున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ నేతలే సీఎం రేవంత్ రెడ్డి పట్ల అనుచితంగా ప్రవరిస్తున్నారని మండిపడ్డారు. అసెంబ్లీ మీడియా పాయింట్‌లో బుధవారం మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడారు. కేసీఆర్ గతంలో బాత్‌రూమ్‌లో జారిపడినప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే స్పందించారని చెప్పారు. అర్ధరాత్రి గ్రీన్ ఛానల్ ద్వారా ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం అందించారని తెలిపారు. కేసీఆర్ అసెంబ్లీకి వచ్చినప్పుడు సీఎం స్వయంగా ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారని చెప్పారు. సీఎం తర్వాత రాష్ట్రంలో అత్యధిక భద్రత పొందుతున్న వ్యక్తి కేసీఆర్ అని పేర్కొన్నారు. సిరిసిల్లలో సీఎం రేవంత్‌రెడ్డికి బీఆర్ఎస్ నేతలు పిండ ప్రదానం చేయడం ఎంతవరకు సమంజసమని మహేశ్ గౌడ్ ప్రశ్నించారు. స్పీకర్ పదవిపై బీఆర్ఎస్ నేత తాతా మధు చేసిన వ్యాఖ్యలపైనా ఆయన మండిపడ్డారు. బీఆర్ఎస్ నేతల దిగజారుడు రాజకీయాలను తెలంగాణ సమాజం ఖండిస్తోందన్నారు. కేసీఆర్ ప్రాణాలకు ప్రమాదం ఉందంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు డ్రామాలు ఆడుతున్నారని ఆరోపించారు. కేసీఆర్‌కు చెడు జరగాలని ఆయన సొంత కుటుంబ సభ్యులే కోరుకుంటున్నారని వ్యాఖ్యానించారు. హరీశ్‌రావు క్షుద్ర పూజలు చేస్తున్నారని కవిత మాట్లాడిన వీడియోలు ఉన్నాయని చెప్పారు. కేసీఆర్‌పై కాంగ్రెస్‌కు గౌరవం ఉందని మహేశ్ గౌడ్ అన్నారు. ఆయన త్వరగా కోలుకుని అసెంబ్లీకి రావాలని కోరుకుంటున్నామని చెప్పారు. దళితులు, బలహీన వర్గాలకు న్యాయం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

# అసెంబ్లీలో కేటీఆర్, హరీశ్‌రావు సహా సభ్యుల సస్పెన్షన్

**మొదటిపేజీ తరువాయి..** తెలంగాణ అసెంబ్లీలో బీఆర్ఎస్ సభ్యులపై స్పీకర్ సస్పెన్షన్ వేటు వేశారు. కేటీఆర్, హరీశ్‌రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్, కోవా లక్ష్మి, సునీతా లక్ష్మారెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డితో పాటు బీఆర్ఎస్ సభ్యులను సభ నుంచి సస్పెండ్ చేశారు. ఈ సెషన్‌లో సభ జరిగే అన్ని రోజులకు ఈ సస్పెన్షన్ వర్తించనుంది. సభ ప్రారంభమైన కొద్దిసేపటికే బీఆర్ఎస్ సభ్యులు నిన్నటి ఎర్రవల్లి ఫామ్‌హౌస్ వద్ద 'చావుడప్పు' నిరసనలపై ఆందోళనకు దిగారు. దీంతో సభలో గందరగోళం నెలకొంది. బీఆర్ఎస్ సభ్యులు సభా కార్యక్రమాలను అడ్డుకుంటున్నారని మంత్రి శ్రీధర్‌బాబు ఆరోపించారు. దాదాపు గంటసేపటి నుంచి బీఆర్ఎస్ సభ్యులు సభను అడ్డుకుంటున్నారని మంత్రి తెలిపారు. వారిని సస్పెండ్ చేయాలని స్పీకర్‌ను కోరుతూ తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ తీర్మానాన్ని సభ ఆమోదించింది. దీంతో బీఆర్ఎస్ సభ్యులను ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల నుంచి సస్పెండ్ చేస్తూ స్పీకర్ నిర్ణయం తీసుకున్నారు. అనంతరం సభను 10 నిమిషాల పాటు వాయిదా వేశారు.

# గవర్నర్‌ను కలిసిన కేటీఆర్.. కాంగ్రెస్ సర్కార్‌పై ఫిర్యాదుల వెల్లువ

**మొదటిపేజీ తరువాయి..** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేతృత్వంలోని పార్టీ ఎమ్మెల్యేల బృందం బుధవారం రాజ్‌భవన్‌లో గవర్నర్‌తో భేటీ అయ్యింది. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలను విస్మరిస్తోందని ఈ సందర్భంగా వారు గవర్నర్‌కు ఫిర్యాదు చేశారు. తమ పార్టీ ఎమ్మెల్యేలపై పోలీసులు దాడులకు పాల్పడ్డారని ఆరోపిస్తూ, అందుకు సంబంధించిన ఆధారాలను గవర్నర్‌కు సమర్పించారు. అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వ 1,000 రోజుల పాలనకు నిరసనగా నల్ల చొక్కాలు ధరించి అసెంబ్లీకి వెళ్లిన తమ ఎమ్మెల్యేలపై పోలీసులు దౌర్జన్యం చేశారని ఆరోపించారు. మహిళా ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని అవమానించారని, ఈ దాడులపై కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకు కేసు నమోదు చేయలేదని పేర్కొన్నారు. దీనికి విరుద్ధంగా తమ పార్టీ నేతలపైనే అక్రమంగా కేసులు బనాయించారని ఆయన మండిపడ్డారు. వంద రోజుల్లోనే హామీలన్నీ అమలు చేస్తామని నమ్మబలికిన కాంగ్రెస్, 1,000 రోజులు గడిచినా 420కి పైగా వాగ్దానాలను గాలికొదిలేసిందని కేటీఆర్ విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో రైతుబంధు కింద రూ. 73,000 కోట్లు అందిస్తే, ప్రస్తుత ప్రభుత్వం కనీసం యూరియాను కూడా సరఫరా చేయలేని దుస్థితిలో ఉందని ఎద్దేవా చేశారు. రైతు బీమాను నీరుగార్చి, నిరుద్యోగ యువతను మోసం చేస్తోందని ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో నెలకొన్న ఈ పరిణామాలపై తక్షణమే జోక్యం చేసుకోవాలని గవర్నర్‌ను కోరినట్లు కేటీఆర్ వివరించారు.

# ఇది బీఆర్ఎస్ సస్పెన్షన్ కాదు..

## ప్రజా సమస్యలపై వేసిన సస్పెన్షన్ వేటు: హరీశ్ రావు

**మొదటిపేజీ తరువాయి..** తెలంగాణ శాసనసభ నుంచి బీఆర్ఎస్ సభ్యులను ఈ సెషన్ ముగిసేంత వరకు సస్పెండ్ చేయడంపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్ రావు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. సస్పెన్షన్ కు గురైన తర్వాత మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న ఈ చర్య బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై వేసిన వేటు కాదని, తెలంగాణ ప్రజల సమస్యలపై విధించిన సస్పెన్షన్ అని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ హక్కుల కోసం, మహిళా ఎమ్మెల్యేలపై జరిగిన దాడి ఘటనలపై అసెంబ్లీ వేదికగా ప్రభుత్వాన్ని నిలదీస్తున్నందుకే కక్షపూరితంగా సస్పెండ్ చేశారని మండిపడ్డారు. "ప్రజలేమో 'మా సమస్యలపై మాట్లాడండి' అని అడుగుతుంటే... రేవంత్ రెడ్డి మాత్రం 'సభ నుంచి బీఆర్ఎస్‌ను బయటకు తోసేయండి' అని మార్షల్స్‌ను ఆదేశిస్తున్నారు" అని హరీశ్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతున్నామనే భయంతోనే ప్రతిపక్షం గొంతు నొక్కే కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. నియంతృత్వం ఎంత పెరిగితే.. ప్రజా తిరుగుబాటు అంత బలపడుతుంది అన్న విషయాన్ని రేవంత్ రెడ్డి గుర్తుంచుకోవాలి అని ఆయన హెచ్చరించారు.

# ఆ బూతులు భరించలేకనే కడుపు మండి మాట్లాడా!

## - కేసీఆర్ పై వ్యాఖ్యల పట్ల ఎమ్మెల్యే శంకర్ వివరణ

**మొదటిపేజీ తరువాయి..** బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ను ఉద్దేశించి తాను చేసిన వ్యాఖ్యలపై చెలరేగిన రాజకీయ దుమారంపై కాంగ్రెస్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్పందిస్తూ మీడియా వేదికగా వివరణ ఇచ్చారు. వ్యక్తిగతంగా ఏ ఒక్కరి చావును కోరుకోవడం ఎట్టి పరిస్థితుల్లోనూ సమర్థనీయం కాదని ఆయన అంగీకరించారు. అయితే, సభలోనూ బయటా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, దళిత వర్గానికి చెందిన అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను, మహిళా మంత్రులను బీఆర్ఎస్ నేతలు అత్యంత అసభ్యకరంగా, కులాల పేరుతో దూషిస్తూ లక్ష్మణరేఖ దాటుతున్నారని ఆరోపించారు. ప్రతిపక్ష నేతల బూతులు వినలేక టీవీలు చూస్తున్న మహిళలు చెవులు మూసుకుంటున్నారని, బీఆర్ఎస్ నేతలు వారి సొంత కుటుంబ సభ్యులు కూడా తలదించుకునేలా ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు. ఈ క్రమంలోనే అసెంబ్లీకి రాకుండా దూరంగా ఉంటున్న కేసీఆర్ వెంటనే సభకు వచ్చి ప్రజా సమస్యలపై చర్చలో పాల్గొనాలని కోరే క్రమంలో కడుపు మండి మాట్లాడాల్సి వచ్చిందని స్పష్టం చేశారు. తెలంగాణ నాలుగు కోట్ల ప్రజలదని, కేసీఆర్ కుటుంబానికి మాత్రమే సొంతం కాదని వ్యాఖ్యానించారు. ఇదే సమయంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వైఖరిని కూడా ఎమ్మెల్యే శంకర్ తీవ్రంగా తప్పుబట్టారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన సోనియా గాంధీ, రాహుల్ గాంధీని ఉద్దేశించి, "ఎక్కడ సచ్చిండు రాహుల్ గాంధీ?" అంటూ మూడు రోజుల క్రితం కరీంనగర్ పర్యటనలో కేటీఆర్ మాట్లాడిన వీడియో క్లిప్పింగ్‌లను ఆయన మీడియా సమక్షంలో ప్రదర్శించారు. కాంగ్రెస్ అగ్రనేతలపై అంతటి దిగజారుడు పదజాలాన్ని ఉపయోగించిన బీఆర్ఎస్ నేతలు, ఇప్పుడు తమకు నీతులు చెప్పడం విడ్డూరంగా ఉందని విమర్శించారు.

# E20 ఇంధనంపై తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం కీలక ప్రకటన.. కేంద్రానికి మద్దతు..

**మొదటిపేజీ తరువాయి..** ఇథనాల్ కలిపిన ఈ20 పెట్రోల్ వాడకం వల్ల వాహనాలు దెబ్బతింటున్నాయన్న ప్రచారంలో వాస్తవం లేదని తెలంగాణ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ఈ అంశంపై రాష్ట్రంలో తమకు ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదులు అందలేదని ఆయన శాసనసభలో వెల్లడించారు. ఈ20 పెట్రోల్ వల్ల వాహనాలు పాడవుతున్నట్లు వాహన యజమానుల నుంచి గానీ, ఆటోమొబైల్ రంగ నిపుణుల నుంచి గానీ రవాణా శాఖ దృష్టికి ఎటువంటి సమాచారం రాలేదని మంత్రి తెలిపారు. "ప్రస్తుతం ఈ అంశానికి సంబంధించి మా వద్ద ఎటువంటి ప్రతికూల నివేదికలు లేవు. అందువల్ల, దీనిపై ప్రత్యేక మార్గదర్శకాలు జారీ చేసే లేదా నియంత్రణ చర్యలు చేపట్టే ఆస్కారం లేదు" అని ఆయన వివరించారు. ఈ విషయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ కేంద్ర ప్రభుత్వ వైఖరితోనే ఏకీభవించారు. గత జూలైలో కేంద్ర పెట్రోలియం శాఖ సహాయ మంత్రి సురేశ్ గోపి సైతం లోక్‌సభలో ఇదే విషయాన్ని స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా 20 కోట్లకు పైగా ద్విచక్ర వాహనాలు, 3 కోట్లకు పైగా పెట్రోల్ కార్లు ఇథనాల్ కలిపిన ఇంధనంతోనే నడుస్తున్నాయని, ఇంజన్ వైఫల్యాలపై ఎటువంటి నిర్దిష్ట ఫిర్యాదులు రాలేదని ఆయన వెల్లడించారు. గతంలో సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆటోమొబైల్ మాన్యుఫాక్చరర్స్ (సియామ్), ఈ20 ఇంధనంలోని అధిక తేమ, క్లోరైడ్ స్థాయిల వల్ల సమస్యలు తలెత్తే అవకాశం ఉందని పెట్రోలియం మంత్రిత్వ శాఖకు లేఖ రాసింది. అయితే, ఈ అంశంపై మరింత ధ్రువీకరణ అవసరమని పేర్కొంటూ తదనంతరం ఆ లేఖను ఉపసంహరించుకుంది. ప్రస్తుతం అటు కేంద్రం, ఇటు రాష్ట్ర ప్రభుత్వం ఈ20 ఇంధనం వల్ల వాహనాలకు ఎలాంటి ముప్పు లేదనే అభిప్రాయంతో ఉన్నాయి.

## నాయీబ్రాహ్మణ సంఘం జిల్లా మహాసభను విజయవంతం చేయాలి



**ఉద్యమ పోరు, తాడ్వాయి, సెప్టెంబర్ 09 :** ఈ నెల 15న ములుగు జిల్లా కేంద్రంలోని DLR గార్డెన్స్‌లో నిర్వహించనున్న నాయీబ్రాహ్మణ సంఘం జిల్లా మహాసభను విజయవంతం చేయాలని తాడ్వాయి మండల నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం మేడారంలోని కళ్యాణకట్టలో తాడ్వాయి మండల కమిటీ సమావేశం మండల అధ్యక్షుడు మద్దూరి రాములు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా నడిగోటి మల్లయ్య మాట్లాడుతూ జిల్లా మహాసభకు నాయీబ్రాహ్మణ సంఘం సభ్యులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. సంఘం బలోపేతం, నాయీబ్రాహ్మణుల సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ఈ మహా సభకు మండలంలోని ప్రతి ఒక్కరూ తరలిరావాలని ఆయన పిలుపు నిచ్చారు.ఈ సమావేశంలో మద్దూరి రాజు, సతీష్, సంతోష్, సందీప్, కిశోర్, కోటి దినేష్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

## వీర్లపల్లి శంకర్‌ను అరెస్టు చేయాలి



**ఉద్యమ పోరు, ఎల్కతుర్తి, సెప్టెంబర్ 09 :** తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకుని తక్షణమే అరెస్టు చేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు ఎల్కతుర్తి పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ నరసింహారావుకు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పిట్టల మహేందర్ ఆధ్వర్యంలో నాయకులు ఫిర్యాదు అందజేశారు. ఈ సందర్భంగా పిట్టల మహేందర్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమించి ప్రజల ఆకాంక్షను నెరవేర్చిన కేసీఆర్‌పై వీర్లపల్లి శంకర్ అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. కేసీఆర్‌పై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. వీర్లపల్లి శంకర్‌పై చట్టప్రకారం చర్యలు తీసుకుని తక్షణమే అరెస్టు చేయాలని పోలీసులను కోరారు. ప్రతిపక్షాల నిరసనలను అడ్డుకోవడం, నాయకులు, కార్యకర్తలను అరెస్టు చేయడం వంటి చర్యలను ప్రభుత్వం విడనాడాలని డిమాండ్ చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై దృష్టి సారించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ శ్రీపతి రవీందర్ గౌడ్, వైస్ చైర్మన్ మునిగడప శేషగిరి, మాజీ మండల అధ్యక్షుడు ఏల్పూరి స్వామి, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ తంగేడ మహేందర్, మాజీ వైస్ ఎంపీపీ తంగేడ నగేష్, ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు కడారి రాజు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు గొల్ల మహేందర్, మండల ప్రధాన కార్యదర్శి జూపాక జడ్సన్, మాజీ సర్పంచ్ కుర్ర సాంబమూర్తి గౌడ్, సీనియర్ నాయకులు మదన్‌మోహన్‌రావు, వొడితల యువసేన అధ్యక్షుడు చిట్టి గౌడ్, భాష బోయిన సురేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## వికలాంగులకు చేయూతనివ్వాలి



**ఉద్యమ పోరు, మంథని, సెప్టెంబర్ 09 :** వికలాంగులకు చేయూతనందిస్తూ వారిలో మనో ధైర్యాన్ని పెంపొందించే కార్యక్రమాలు చేపట్టాలని ఆర్ఆర్ క్రియేషన్స్ అధినేత, సీనియర్ పాత్రికేయుడు మేడగోని రాజమౌళి గౌడ్ పిలుపునిచ్చారు. బుధవారం ప్రణామ్ డే కేర్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. మహిళా సాధికార కేంద్రం ఆధ్వర్యంలో వికలాంగులు, వితంతువులకు ప్రభుత్వం అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. వికలాంగుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందని, వాటిని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించేందుకు కృషి చేయాలని అన్నారు. వికలాంగులకు ప్రభుత్వం అందించే సహాయ సహకారాలను పొందే విధంగా సంబంధిత అధికారులు, స్వచ్ఛంద సంస్థలు చొరవ చూపాలని సూచించారు. ఈ సందర్భంగా వృద్ధుల కోసం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రణామ్ డే కేర్ సెంటర్ సూపరింటెండెంట్ ఖాజా మొయినుద్దీన్, దత్త గౌడ్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

# వరంగల్ జిల్లా ఉద్యోగులకు కీలక పిలుపు.. సెప్టెంబర్ 10న చలో హైదరాబాద్

**ఉద్యమ పోరు, వరంగల్, సెప్టెంబర్ 09 :** రాష్ట్ర టీజీఈజాక్ పిలుపు మేరకు ఉద్యోగుల పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం సెప్టెంబర్ 10న హైదరాబాద్‌లో నిర్వహించనున్న ★"ఉద్యోగుల హక్కుల సాధన సభ"★ను విజయవంతం చేయాలని టీజీఈజాక్ వరంగల్ జిల్లా చైర్మన్ గాజె వేణుగోపాల్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బుధవారం వరంగల్ జిల్లా పరిధిలోని వివిధ శాఖాధిపతుల కార్యాలయాలను సందర్శించిన ఆయన.. అధికారులను కలిసి ఉద్యోగుల తరలింపుపై చర్చించారు. కలెక్టరేట్, డీఎంహెచ్‌వో, డీఈవో, ఎంజీఎం, సహకార శాఖ, రిజిస్ట్రేషన్ శాఖ, ఐసీడీఎస్, ఖజానా కార్యాలయాలతో పాటు పలు కార్యాలయాల్లో ఉద్యోగులతో సమావేశమై చలో హైదరాబాద్ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. అనంతరం టీఎన్జీవో భవన్‌లో నిర్వహించిన జిల్లా అత్యవసర కార్యవర్గ సమావేశానికి హాజరైన గాజె వేణుగోపాల్ మాట్లాడుతూ.. ఉద్యోగుల అపరిష్కృత సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ఉద్యోగుల హక్కుల సాధన సభకు అన్ని శాఖల ఉద్యోగులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. కొన్ని ప్రచార మాధ్యమాల్లో వస్తున్న వదంతులను ఉద్యోగులు నమ్మవద్దని, ఉద్యోగుల హక్కుల సాధన సభ యథావిధిగా కొనసాగుతుందని స్పష్టం చేశారు. పీఆర్సీ అమలు, పెండింగ్ ఆర్డీఏల విడుదల, ఉద్యోగుల పెండింగ్ బకాయిల చెల్లింపు, ఈహెచ్‌ఎస్‌ను పకడ్బందీగా అమలు చేయడం, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించడం తదితర డిమాండ్ల సాధన కోసం ఈ సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగులు తమంతట తాముగా పెద్ద సంఖ్యలో హైదరాబాద్‌కు తరలి వచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.





ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా టీఎన్జీవోస్ యూనియన్ కార్యదర్శి పాలకుర్తి సదానందం, కోశాధికారి కిరణ్ కుమార్, సిటీ అధ్యక్షులు శంకేష్ రాజేష్, జిల్లా బాధ్యులు ఆనంద్, సతీష్, చిరంజీవి, గణేష్ సదానందం, నాగేశ్వరరావు, వంగ రవీందర్, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సాంబయ్య, కార్యదర్శి భాను ప్రకాష్, కోశాధికారి ఉదయ్, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలల్లో అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి

**ఉద్యమ పోరు, మంథని, సెప్టెంబర్09 :** పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసి, విద్యార్థులకు మెరుగైన మౌలిక వసతులు అందుబాటులోకి తీసుకురావాలని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. బుధవారం మంథని మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఖాన్‌సాయిపేట ఎంపీపీఎస్, భట్టుపల్లి ఎంపీపీఎస్, వెంకటాపూర్ ఎంపీపీఎస్, మల్లారం ఎంపీపీఎస్, ఆరెంద జెడ్పీహెచ్‌ఎస్, స్వర్ణపల్లి ఎంపీపీఎస్ పాఠశాలలను సందర్శించిన కలెక్టర్.. కొనసాగుతున్న అభివృద్ధి పనులు, విద్యార్థులకు అందుతున్న మౌలిక వసతులు, హాజరు, విద్యా బోధన, అభ్యసన స్థాయిపై ఉపాధ్యాయులు, అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.





**రహదారి పనులు వెంటనే ప్రారంభించాలి**

మంథని మండలంలోని వెంకటాపూర్ నుంచి ఆరెంద వరకు ఉన్న సింగిల్ రోడ్డును డబుల్ రోడ్డుగా విస్తరించే పనులను వెంటనే క్షేత్ర స్థాయిలో ప్రారంభించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రహదారి విస్తరణ పనులు పూర్తయ్యే వరకు ప్రస్తుతం ఉన్న రహదారిపై ఏర్పడిన గుంతలను యుద్ధప్రాతిపదికన పూడ్చి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

**నిర్మాణ పనుల్లో జాప్యం వద్దు**

ఖాన్‌సాయిపేట ఎంపీపీఎస్ పాఠశాలలో కాంపౌండ్ వాల్, పెయింటింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. వెంకటాపూర్ ఎంపీపీఎస్ పాఠశాలలో మంజూరైన అదనపు తరగతి గది నిర్మాణాన్ని నెల రోజుల్లోగా పూర్తి చేయాలని సూచించారు. పాఠశాలల్లో చేపట్టిన అన్ని అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేసి, విద్యార్థులు కొత్తగా కల్పించిన సౌకర్యాలను పూర్తిస్థాయిలో వినియోగించుకునేలా చూడాలని తెలిపారు.

**ప్రతి విద్యార్థికి ప్రాథమిక విద్యా నైపుణ్యాలు కల్పించాలి**

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థిపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ సూచించారు. ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి సారించి ప్రతి విద్యార్థికి కనీసం చదవడం, రాయడం, ప్రాథమిక గణిత నైపుణ్యాలు వచ్చేలా బోధన అందించాలని ఆదేశించారు. విద్యలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వారి అభ్యసన స్థాయిని మెరుగుపరిచేందుకు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ప్రతి విద్యార్థి విద్యా ప్రగతిపై ఉపాధ్యాయులు వ్యక్తిగతంగా శ్రద్ధ చూపాలని తెలిపారు.

**హాజరుపై నిరంతర పర్యవేక్షణ**

విద్యార్థులు ప్రతిరోజూ పాఠశాలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. హాజరు తక్కువగా ఉన్న విద్యార్థుల తల్లిదండ్రులతో సంప్రదించి కారణాలను తెలుసుకుని అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతి పాఠశాలలో నెలకోసారి తల్లిదండ్రులు–ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించి విద్యార్థుల హాజరు, విద్యా ప్రగతి, అభ్యసన సామర్థ్యాలపై తల్లిదండ్రులకు వివరించాలని తెలిపారు. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు విద్యార్థుల విద్యా ప్రమాణాల పెంపునకు సమాన ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు పూర్తి స్థాయిలో వినియోగించుకునేలా చూడాలని అధికారులను, ఉపాధ్యాయులను కలెక్టర్ ఆదేశించారు. ఈ పర్యటనలో ఎంపీడీవో శ్రీజారెడ్డి, ఎంపీవో షబ్బీర్ పాషా, ఏఈ పి.ఆర్. జగదీశ్, సంబంధిత అధికారులు, ఇంజినీరింగ్ అధికారులు, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మంథనిలో పిరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే

**ఉద్యమ పోరు, మంథని, సెప్టెంబర్ 09 :** జాతీయ గణాంక శాఖ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న పిరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే (పీఎల్ఎఫ్ఎస్)–2026లో భాగంగా మంథని పట్టణంలో సర్వే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గణాంక శాఖ అధికారి గుర్రం శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా మంథని ఆర్డీవో సురేష్, తహసీల్దార్ ఆరిఫోద్దీన్, ఎంపీడీవో శ్రీజ, మున్సిపల్ కమిషనర్ మనోహర్, మేనేజర్ శారదలను కలిసి సర్వేకు సంబంధించిన కరపత్రాలను అందజేశారు. సర్వే లక్ష్యాలు, ప్రాముఖ్యతను వారికి వివరించారు. దేశంలో ఉపాధి, నిరుద్యోగం, కార్మిక శక్తి భాగస్వామ్యం, స్వయం ఉపాధి తదితర అంశాలపై విశ్వసనీయ గణాంకాలను రూపొందించేందుకు ఈ సర్వే నిర్వహిస్తున్నట్లు శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. మొదటి దశలో కుటుంబాల సాధారణ వివరాలను నమోదు చేసి, అనంతరం ఎంపికైన కుటుంబాలను మూడు నెలల పాటు ప్రతి నెలా ఒకసారి సందర్శించి మొబైల్ ట్యాబ్ ద్వారా సమాచారాన్ని సేకరిస్తామని పేర్కొన్నారు. కుటుంబ సభ్యుల విద్యార్హతలు, విద్యాభ్యాసం, వృత్తి విద్య, ఉద్యోగం, స్వయం ఉపాధి, రోజువారీ కూలి పనులు, పని గంటలు, వేతన వివరాలు, మహిళల ఆదాయ వనరులు తదితర వివరాలను నమోదు చేస్తామని తెలిపారు. అలాగే జొమాటో, స్విగ్గీ, రాపిడో, ఓలా, ఉబెర్ వంటి డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా పని



చేస్తున్న గిగ్, ప్లాట్‌ఫారమ్ కార్మికుల వివరాలను కూడా సేకరిస్తామని వివరించారు. సర్వేలో సేకరించిన సమాచారం పూర్తిగా గోప్యంగా ఉంచబడుతుందని, కేవలం గణాంకాల రూపకల్పనకు మాత్రమే వినియోగిస్తామని స్పష్టం చేశారు. ప్రజలు ఎలాంటి సందేహాలకు తావు లేకుండా సరైన సమాచారాన్ని అందించి సర్వే విజయవంతానికి సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మంథని డీవైఎస్ఓ వెంకటేశ్వర్లు, ఎంపీఎస్ఓ సంధ్యారాణి, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# ప్రభుత్వ ఉద్యోగాల పేరుతో నిరుద్యోగ యువతను మోసం చేసిన వ్యక్తి అరెస్ట్



**ఉద్యమ పోరు, హనుమకొండ / కాజీపేట, సెప్టెంబర్ 09 :** ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించి నిరుద్యోగ యువత నుంచి భారీ మొత్తంలో నగదు, బంగారం, అసలు విద్యా సర్టిఫికెట్లు సేకరించి మోసాలకు పాల్పడుతున్న వ్యక్తిని కాజీపేట పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. నిందితుడు మెట్టు ప్రవీణ్ కుమార్ (41), నిజామాబాద్ జిల్లా వాసిగా గుర్తించారు. ఇన్‌కమ్ ట్యాక్స్ శాఖలో ట్యాక్స్ అసిస్టెంట్, ఇన్‌కమ్ ట్యాక్స్ ఆఫీసర్ తదితర ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించి పలువురు నిరుద్యోగుల నుంచి డబ్బులు వసూలు చేసినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది.

## నకిలీ నియామక ఉత్తర్వులతో మోసం

స్పోర్ట్స్ కోటా, ఎన్‌సీసీ కోటా, బ్యాక్‌డోర్ రిక్రూట్‌మెంట్ పేరుతో ఉద్యోగాలు ఇప్పిస్తానని నిందితుడు అభ్యర్థులను ఆకర్షించినట్లు పోలీసులు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగాలకు సంబంధించిన వెబ్‌సైట్లను చూపిస్తూ, గతంలో జారీ చేసిన నియామక ఉత్తర్వుల్లో పేర్లు మార్చి నకిలీ అపాయింట్‌మెంట్ ఆర్డర్లు, మెమోరాండంలను తయారు చేసి అభ్యర్థులకు చూపించినట్లు పేర్కొన్నారు. మోసం మరింత నమ్మదగినదిగా కనిపించేలా మెడికల్ టెస్టులు, పోలీస్ వెరిఫికేషన్ వంటి ప్రక్రియలు నిర్వహిస్తున్నట్లు నటించినట్లు పోలీసులు తెలిపారు. అలాగే ICAIలో నిర్వహించే ఓరియంటేషన్, ఐటీ కోర్సులను ప్రభుత్వ ఉద్యోగాలకు సంబంధించిన శిక్షణగా నమ్మించి పలువురు యువతను మోసం చేసినట్లు దర్యాప్తులో తేలిందన్నారు.

## రూ.85 లక్షలు, 4 తులాల బంగారం వసూలు

ఇప్పటివరకు గుర్తించిన బాధితుల నుంచి సుమారు రూ.85 లక్షల నగదు, 4 తులాల బంగారం తీసుకున్నట్లు పోలీసులు గుర్తించారు. బాధితుల నుంచి అసలు విద్యా సర్టిఫికెట్లు, ఉద్యోగ సంబంధిత పత్రాలను కూడా నిందితుడు తీసుకున్నట్లు వెల్లడించారు.

## రూ.18.22 లక్షల విలువైన వస్తువులు స్వాధీనం

నిందితుడి వద్ద నుంచి సుమారు రూ.18.22 లక్షల విలువైన నగదు, ఇతర వస్తువులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

## స్వాధీనం చేసుకున్న వాటిలో:

★ Dell i7 8th Generation Laptop
★ Maruti Brezza కారు
★ రూ.2 లక్షల నగదు
★ iPhone 17 Pro Max
★ OPPO స్మార్ట్‌ఫోన్
★ రెండు కీప్యాడ్ మొబైల్ ఫోన్లు
★ బాధితులకు సంబంధించిన అసలు విద్యా సర్టిఫికెట్లు, ఉద్యోగ పత్రాలు
★ నకిలీ నియామక ఉత్తర్వుల తయారీకి ఉపయోగించిన పారదర్శక షీట్లు/ప్లాస్టర్, ఎల్లో హైలైటర్
★ Audit Identity Card జిరాక్స్ కాపీ తదితర సామగ్రి

అదనంగా పలువురు బాధితులకు సంబంధించిన కీలకమైన అసలు పత్రాలను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

## మరింత మంది బాధితులపై ఆరా

కాజీపేట ఏసీపీ పి. ప్రశాంత్ రెడ్డి ఆదేశాల మేరకు, కాజీపేట పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ ఇన్‌స్పెక్టర్ జే. శ్యామ్ సుందర్ పర్యవేక్షణలో పోలీసులు దర్యాప్తు చేపట్టి నిందితుడిని గుర్తించి అరెస్ట్ చేశారు. ఈ వ్యవహారంలో మరింత మంది బాధితులు ఉన్నారా? నిందితుడి మోసాల వెనుక మరెవరైనా ఉన్నారా? అనే కోణాల్లో దర్యాప్తు కొనసాగుతున్నట్లు పోలీసులు తెలిపారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామని, బ్యాక్‌డోర్ రిక్రూట్‌మెంట్ ద్వారా ఉద్యోగం వస్తుందని, ప్రత్యేక కోటాలో ఉద్యోగం ఇప్పిస్తామని లేదా ప్రభుత్వ అధికారులతో పరిచయాలు ఉన్నాయని చెప్పి ఎవరైనా డబ్బులు అడిగితే అప్రమత్తంగా ఉండాలని కాజీపేట పోలీసులు సూచించారు. ప్రభుత్వ ఉద్యోగాల నియామక ప్రక్రియ, నోటిఫికేషన్లు, ఫలితాలు తదితర సమాచారాన్ని సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారిక వెబ్‌సైట్లు, అధికారిక నోటిఫికేషన్ల ద్వారా మాత్రమే ధృవీకరించుకోవాలని తెలిపారు. నకిలీ అపాయింట్‌మెంట్ ఆర్డర్లు, ఐడీ కార్డులు, జీతం స్లిప్పులు లేదా ఇతర అధికారిక పత్రాలు చూపించినా సంబంధిత శాఖ అధికారుల ద్వారా తప్పని సరిగా ధృవీకరించుకోవాలని సూచించారు. "ప్రభుత్వ ఉద్యోగానికి షార్ట్‌కట్ లేదు.. ఉద్యోగాల పేరుతో డబ్బులు అడిగే వ్యక్తులను నమ్మవద్దు." అని కాజీపేట పోలీసులు ప్రజలకు సూచించారు.

# ట్రై సిటీస్ హాఫ్ మారథాన్ - 2026 పోస్టర్ ఆవిష్కరణ

**ఉద్యమ పోరు, హనుమకొండ, సెప్టెంబర్ 09 :** క్రెడాయ్ వరంగల్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న 'ట్రై సిటీస్ హాఫ్ మారథాన్–2026, ఎడిషన్–2' పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్‌తో కలిసి యువ నాయకుడు విష్ణు వర్ధన్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం పోలీస్ కమిషనర్ శ్వేత, ఐపీఎస్‌ను సీపీ కార్యాలయంలో కలిసి మారథాన్ నిర్వహణకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ సహకారం అందించాలని కోరారు.




## అక్టోబర్ 11న మారథాన్

అక్టోబర్ 11, 2026న హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రం గ్రౌండ్స్ నుంచి మారథాన్ ప్రారంభం కానుంది. ఇందులో 21.1 కిలోమీటర్ల హాఫ్ మారథాన్‌తో పాటు 10 కిలోమీటర్లు, 5 కిలోమీటర్ల రన్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. యువతలో ఆరోగ్యం, ఫిట్‌నెస్‌పై అవగాహన పెంపొందించడంతో పాటు వరంగల్ ట్రై సిటీస్‌లో క్రీడా స్ఫూర్తిని ప్రోత్సహించడమే మారథాన్ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. కార్యక్రమానికి జిల్లా యంత్రాంగం, పోలీస్ శాఖ సహకారం కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు సోమయ్య, కందుకూరు శ్రీనివాస్, రన్నర్స్ చరణ్, సరస్వతి తదితర నిర్వాహకులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

# గుండాయిజం, రౌడీయిజం సంస్కృతిని బీఆర్ఎస్ మానుకోవాలి

**ఉద్యమ పోరు, హైదరాబాద్, సెప్టెంబర్ 09 :** బీఆర్ఎస్ నాయకులు గుండాయిజం, రౌడీయిజం సంస్కృతిని వీడి ప్రజాస్వామ్య పద్ధతుల్లో వ్యవహరించాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి సూచించారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి, అక్రమాలు, భూకబ్జాలు, పాలనా వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే ఆ పార్టీ నాయకులు కొత్త అంశాలను తెరపైకి తెస్తున్నారని విమర్శించారు. గతంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు తదితరులు వ్యవహరించిన తీరును తెలంగాణ ప్రజలు మరిచిపోలేదని అన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ప్రతిపక్ష నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలతో ఎలా వ్యవహరించారో సమాజం మొత్తం చూసిందన్నారు. ప్రస్తుతం బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న ప్రతి కార్యక్రమాన్ని కూడా ప్రజలు నిశితంగా గమనిస్తున్నారని పేర్కొన్నారు. అసెంబ్లీ ప్రజాస్వామ్యానికి అత్యున్నత వేదిక అని, సభ్యులు సభా సంప్రదాయాలను పాటిస్తూ హుందాగా, మర్యాదగా వ్యవహరించాల్సిన బాధ్యత ఉందని నాయిని అన్నారు. సభలో ఆరోగ్యకరమైన చర్చకు బదులుగా దూషణలు, దౌర్జన్యాలకు పాల్పడటం సరికాదన్నారు.బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఇచ్చిన హామీల్లో ఎన్ని అమలు చేశారో ముందుగా ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దళితులకు మూడెకరాల భూమి, కేజీ టు పీజీ ఉచిత విద్య, నిరుద్యోగ భృతి వంటి హామీల అమలు పరిస్థితిపై సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. గత ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను తీవ్ర ఇబ్బందుల్లోకి నెట్టిందని



నాయిని ఆరోపించారు. ఆర్థిక సవాళ్లను అధిగమిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తోందని తెలిపారు. తమ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి బీఆర్ఎస్ నాయకులు అసహనానికి గురవుతున్నారని విమర్శించారు. అధికారంలోకి రావడానికి అడ్డదారులు వెతకడం, ప్రజల్లో గందరగోళం సృష్టించడం కాకుండా నిర్మాణాత్మక ప్రతిపక్షంగా వ్యవహరించాలని నాయిని సూచించారు. ప్రజాస్వామ్యాన్ని గౌరవిస్తూ ప్రజలకు ఉపయోగపడే రాజకీయాలు చేయాలని కోరారు. "ఎన్ని కొత్త నాటకాలు ఆడినా ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరు. గతంలో మీరు చేసిన ప్రతి పని ప్రజల కళ్ల ముందే ఉంది. గుండాయిజం, రౌడీయిజం సంస్కృతిని మానుకుని ప్రజాస్వామ్య పద్ధతుల్లో వ్యవహరించాలి" అని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి స్పష్టం చేశారు.

# ఆర్థిక విధ్వంసంతో సంక్షేమ పథకాలకు నిధుల కొరత

**ఉద్యమ పోరు, హైదరాబాద్, సెప్టెంబర్ 09 :** గత ప్రభుత్వాలు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను తీవ్రంగా దెబ్బతీయడంతో ప్రస్తుత ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలులో అనేక సవాళ్లు ఎదుర్కొంటోందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలపై చర్చించి పరిష్కార మార్గాలను కనుగొనేందుకు సభా సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సభ్యులకు సూచించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, అందుకు ప్రతిపక్ష సభ్యులు సహకరించాలని నాయిని కోరారు. చర్చకు సమయం ఇస్తామని చెప్పినప్పటికీ సభలో చర్చకు కూర్చోకుండా వివిధ రకాల ఆందోళనలకు దిగడం సరైన పద్ధతి కాదన్నారు. ప్రతిపక్ష నేతలు, ఇతర నాయకులు బాధ్యతాయుతమైన ప్రజాప్రతినిధులుగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. బ్లాక్‌మెయిల్ రాజకీయాలు, బెదిరింపుల ధోరణికి స్వస్తి పలికి ప్రజా సమస్యలపై నిర్మాణాత్మకంగా చర్చించాలని సూచించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ భద్రత విషయంలో ప్రభుత్వం తగిన జాగ్రత్తలు తీసుకోవాలని నాయిని సభలో కోరారు. భద్రతకు సంబంధించి ఏవైనా అనుమానాలు ఉంటే వాటిపై సమగ్రంగా పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.

## పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యం

'రోటి, కపడా, మకాన్' వంటి ప్రజా సంక్షేమ లక్ష్యాలతో పేదలకు అండగా నిలిచిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని నాయిని రాజేందర్ రెడ్డి పేర్కొన్నారు. సంక్షేమ పథకాల అమలుతో పాటు రాష్ట్ర అభివృద్ధికి



ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రజాధనం, అసెంబ్లీ సమయం వృథా కాకుండా సభలో చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. ప్రజలు అన్ని విషయాలను గమనిస్తున్నారని, బాధ్యతారహితమైన వ్యవహారశైలిని ప్రజలు ఎప్పటికీ ఆమోదించరని అన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అవసరమైన కఠిన చర్యలు తీసుకుని అసెంబ్లీ గౌరవాన్ని, ప్రజాస్వామ్య విలువలను కాపాడాలని సభాపతిని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి కోరారు.

# టేకుమట్ల పోలీస్ స్టేషన్‌లో ఎస్పీ ఆకస్మిక తనిఖీ

**ఉద్యమ పోరు, భూపాలపల్లి జిల్లా / టేకుమట్ల, సెప్టెంబర్ 09 :** భూపాలపల్లి జిల్లాలో పోలీసు సేవలను మరింత సమర్థవంతంగా అందించడమే లక్ష్యంగా జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ బుధవారం టేకుమట్ల పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని పలు రికార్డులను పరిశీలించిన ఎస్పీ.. పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతి, సీసీ కెమెరాల పనితీరు, స్టేషన్ పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేయడంతో పాటు ప్రజల నుంచి అందే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం పోలీస్ సిబ్బందితో సమావేశమైన ఎస్పీ మాట్లాడుతూ.. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నేరాల నియంత్రణకు సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని, ప్రజలకు మరింత నాణ్యమైన, పారదర్శకమైన పోలీస్ సేవలు అందించేలా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని



ఆదేశించారు. ప్రజలకు పోలీస్ శాఖపై మరింత నమ్మకం కలిగేలా విధులు నిర్వహించాలని, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఎస్పీ సూచించారు.

Printed, Published and Owned by Bandari Srujana, on behalf of Sri Venkateswara Printing Solutions, Editor - Bandari Sumanth, is responsible for news selection under PRB act
prgi.gov.in RNI.TGTEL/26/A7716, # 19-212/3-3A, Narsampet, Warangal, Telangana, India - 506132, Cell : 9182828767, 8331895759 Email:spaknp2026@gmail.com